క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన గవిడి సత్యనారాయణ రూ.18 వేలు ఆర్థిక సహకారం అందజేసారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక సాయాన్ని ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి తదితరులకు అందజేసారు. కార్యక్రమంలో గురుస్వామి గుడ్ల శ్రీను, ఇప్పిలి తిరుమల, మహంతి ఉమ, కడగల సూరి, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు



గుర్లలో పైపులైన్ల మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గుర్ల: మండల కేంద్రానికి మంచి నీటి సరఫరాకు వినియోగిస్తున్న పైపులైన్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. చంపావతి నదిలోని కొండపాలేం రక్షిత మంచినీటి పథకం నుంచి వస్తున్న తాగునీరు పైపులైన్లు ఎక్కడికక్కడే మరమ్మతులకు గురవడంతో త్వరితగతిన మరమ్మతులు చేస్తున్నారు. గుర్లలో డయేరియా ప్రబలడానికి తాగునీరే కారణం కావడంతో పైపులైన్లు మొత్తం పరిశీలించి లీక్‌లు ఉన్న పైపుల స్థానంలో కొత్త పైపులు వేస్తున్నారు. గుర్లలో తాగునీరు పైపులైన్ల మరమ్మతులు పూర్తయ్యాయని గ్రామంలో ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ తెలిపారు.

విద్యార్థులకు పలు పోటీలు



బాలభవన్‌లో నృత్య పోటీల్లో పాల్గొన్న బాలికలు

చీపురుపల్లి: పట్టణంలోని జవహర్ బాలభవన్ కేంద్రంలో సంగీతం, నృత్య విభాగాల్లో నిర్వహించిన పోటీలకు 71 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు బాలభవన్ కేంద్రంలో విద్యార్థులకు రెండు రోజులు పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే తొలిరోజు శుక్రవారం సంగీతం విభాగంలో శాస్త్రీయ సంగీతం, జానపద గీతం, లలితా సంగీతం, దేశభక్తి గీతాలు, నృత్యం విభాగంలో భరతనాట్యం, కూచుపూడి, జానపదం అంశాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 71 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు శనివారం చిత్రలేఖనం, ఇన్‌స్ట్రుమెంటర్ ప్లే విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. విజేతలకు నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు ఇవ్వనున్నారు.

ఆయుష్ సేవలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యురాలు సునీత

బొండపల్లి: ఆయుష్ వైద్యవిధాన్ పరిషత్‌లో ఆయుర్వేద వైద్యానికి సంబంధించి ప్రభుత్వం ఆయుష్ వైద్య కేంద్రాల్లో అందించే సేవలపై వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని గొట్లాంలోని ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు బి.సునీత పేర్కొన్నారు. మండలంలోని దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి ఆయుర్వేద వైద్య సేవల పట్ల శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు అన్ని రకాలైన రోగాలకు ఉచితంగా వైద్య సేవలను అందించడంతో పాటు, మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యులు షరిష్మా, ఎంపీహెచ్ఈఓ అప్పలనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ బాధ్యతలు కమిటీలకు అప్పగించాలి

కొత్తవలస: హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఆలయ కమిటీలను ఏర్పాటు చేసి వాటికి బాధ్యతలు అప్పగించాలని ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ భీశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తవలసలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనిపై కార్యాచరణ నిమిత్తం ఈ నెల 9న గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలకు చెందిన కార్యకర్తల సన్నాహక సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సంయోజకులు కె.అప్పారావు, ఖండ ధర్మ ప్రచారక్ చింతాడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

దిగుబడులపైనే అన్నదాత ఆశలు

- ప్రారంభమైన వరి కోతలు
- ఎకరానికి 25 బస్తాల వరకు దిగుబడి రావచ్చని అధికారుల అంచనా
- ఎరువుల ధరల పెరుగుదలతో పెరిగిన పెట్టుబడులు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

నియోజకవర్గంలో మండలాల వారీగా సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)
చీపురుపల్లి	6600
గరివిడి	7800
గుర్ల	9872
మెరకముడిదాం	9885

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆరుగాలం శ్రమించి, లెక్కకు మించి పెట్టిన పెట్టుబడులు కలిసి రావాలంటే ఆశించిన దిగుబడులు రావాల్సిందే.. ఈ ఏడాది ఖరీఫ్‌లో పెరిగిన ఎరువుల ధరలతో సాగులో పెట్టుబడులు పెరిగాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రైతు భరోసా పెట్టుబడి సాయం కూటమి ప్రభుత్వం అందజేయలేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడులైనా రావాలంటే దిగుబడులు బాగా రావాల్సిందే.. వరి కోతలకు ముందు ఇటీవల తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందినా... వాతావరణం సహకరించింది. కోతలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో ఇప్పటికే సన్నరకం పంట కోతలు ఆరంభమయ్యాయి. మరో పది రోజుల్లో మిగతా రకాల వరి పంట కూడా కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది రైతులంతా వరి దిగుబడులపైనే ఆశలును పెట్టుకున్నారు. పెరిగిన వ్యవసాయ మదుపులకు తగ్గట్టుగా దిగుబడులు వస్తాయనే ఆశతో రైతు ఎదురు చూస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు కాస్త ముందస్తుగా కురవటంతో రైతులు జూలైలోనే దమ్ములు చేపట్టారు. ఆరంభంలో పుష్కలమైన వర్షాలు కలిసి రావటంతో రైతులు పెట్టుబడులకు ఏమాత్రం వెనకాడకుండా వెచ్చించారు. పంట ఆరంభంలో వర్షాలు సక్రమంగా ఉన్నప్పటికీ మధ్యస్త, చివర దశలో కాస్త వర్షాభావ పరిస్థితులు తలెత్తటంతో తెగుళ్లు కూడా వ్యాపించాయి.

వ్యాపించిన కుళ్లు తెగుళ్లు

ఈ ఏడాది ఎక్కువగా వరి పంటకు కుళ్లు తెగుళ్లు వ్యాపించాయి. వరి మధ్యస్త, చివర దశలో వర్షాభావం తలెత్తటం, అధిక రసాయనిక ఎరువుల వినియోగంతో కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించాయి. గత ప్రభుత్వంలో అందుబాటులోనికి తీసుకువచ్చిన 1121 వరి రకాన్ని రైతులు ఎక్కువగా సాగు చేశారు. ఈ వరి రకం పంట చేను బలంగా ఏపుగా పెరిగి పచ్చదనంగా ఉన్నప్పటికీ తెగుళ్లతో చివర దశలో ఎంతో ఇబ్బందులు పడ్డారు. కొత్త రకాలను సాగు చేయటం వలన తెగుళ్ల బెడద తగ్గుతుందని, దిగుబడులు పెరుగుతాయని ఎంతో ఆశించిన రైతులు చివర దశలో వచ్చిన తెగుళ్ల కారణంగా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి రసాయనిక మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది.



ప్రారంభమైన సన్నరకం వరి కోతలు

నియోజకవర్గంలో 34,157 ఎకరాల్లో వరి సాగు

చీపురుపల్లి నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 34,157 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసారు. ఈ ఏడాది రైతులు ఎక్కువగా 1121 శీఘ్రుతి వరి రకాన్ని సాగు చేసారు. ఈ రకం తినటానికి అనువుగా ఉంటాయని, దిగుబడులు కూడా బాగుంటాయని గత ప్రభుత్వం కొత్త వంగడాలను మార్కెట్లోనికి తీసుకువచ్చింది. పంట కోత దశకు చేరుకోవటంతో వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టి దిగుబడులను అంచనా వేస్తున్నారు. వ్యవసాయాధికారులు కూడా రైతుల అంచనాలకు తగ్గట్టుగానే మంచి దిగుబడులు వస్తాయనే నమ్మకంతోనే ఉన్నారు. 1121 రకానికి ఆశించిన స్థాయిలో దిగుబడులు ఉండొచ్చనని అంచనా వేస్తున్నారు.

పకడ్బందీగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు



దత్తిరాజేరు: శిక్షణలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ పైడిపునాయుడు



జామి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఈ సతీష్

బొండపల్లి: సాగునీటి సంఘాలకు ఈ నెలాఖరులో జరగనున్న ఎన్నికలను పక్కాగా నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గజపతినగరం ఇరిగేషన్ డీఈఈ శ్రీరాములునాయుడుతో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలోనే సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నదని ఎన్నికలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధింత ఎన్నికల అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ ఆవాల సూరీడు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ పైడిపునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ పోలింగ్ అధికారులు అసిస్టెంట్ పోలింగ్ అధికారులు ఎన్నిక సమయంలో నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు.

జామిలో..

జామి: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ సతీష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిపే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. మొత్తం మూడు బ్యాచ్‌ల చొప్పున 320 మందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సంబంధిత ఎన్నికల అధికారులకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ ఈఈ ఎంవీ రమణ వీరికి అవగాహన కల్పించారు. డీఈఈ శ్రీచరణ్, ఏఈ హేమంత్‌కుమార్, తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

చీపురుపల్లి: భూకబ్జా నిరోధక చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో భూకబ్జా నిరోధక చట్టాన్ని పునరుద్ధరిస్తూ తీర్మానం చేసిన నేపథ్యంలో ఆ చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. భూకబ్జాలు విషయంలో ఎలాంటి వారైనా సరే ఆ చట్టాన్ని వినియోగించాల్సిందేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల కమిటీల్లో అదనంగా మరో ఇద్దరు సభ్యులను పెంచుతూ, వార్షిక ఆదాయం రూ.50 వేలు ఉన్న ఆలయాల్లో అర్చకులకు నెలకు రూ.15 వేలు వేతనాలు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేసిందన్నారు.

ప్రత్యేక ఆధార్ సీడింగ్ శిబిరాలు

జామి: పోస్టల్ శాఖ వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా లబ్ధిదారులకు డైరెక్ట్ బెనిఫిషియర్ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రత్యేక ఖాతాలు తెరవడంతో పాటు ప్రత్యేక ఆధార్ సీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జామి సబ్ పోస్ట్‌మాస్టర్ కె.అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ఆధార్ లింకేజిని సులభతరం చేయడానికి నవంబర్ 15వరకు పోస్టాఫీసుల్లోను, సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు నేరం



తల్లీబిడ్డలకు అవగాహన కల్పిస్తున్న హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. గరివిడి మండలం శివరాంలో గ్రామంలో 14 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో బాల్య వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు నిశ్చయించుకున్నారు. ఈ సమాచారం తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు దృష్టికి వెళ్లగా వారికి శుక్రవారం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం కౌన్సెలింగ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధి భోగాపురపు శ్రీదేవి, రీజనల్ ప్రతినిధి ఎం.హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళా తీరు మారాలి..



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీపురుపల్లి: ఎమ్మెల్యే కళా వెంకటరావు తీరు మారాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు మారాలని ఎమ్మెల్యే కళా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గత ప్రభుత్వంలో తమ నాయకుడు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి చూపించారన్నారు. ఐదు నెలల కిందట అధికారం చేపట్టిన చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసపుచ్చుతున్నారని ధ్వజమెత్తారు. మోసం.. దగా.. చేయడం టీడీపీ నేతలకు అలవాటన్నారు. జగనన్న పాలనలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు వెళ్లాయన్నారు. నేడు సంక్షేమం లేకుండా కూటమి ప్రభుత్వం కుత్సిత రాజకీయాలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. తల్లికి వందనం, రైతు భరోసా వంటి పథకాలు జాడ లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యే కళా వెంకటరావు జగన్‌పై విమర్శలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో సుమారు 16 రోడ్ల పనులు మంజూరయ్యాయని, వీటిలో కొన్ని ప్రారంభమయ్యాయని చెప్పారు. మిగిలిన పనులపై శ్రద్ధ వహిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డ శ్రీనివాసనాయుడు, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, రేవల్ల సత్తిబాబు, చింతాడ లక్ష్మణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

వేతనాల కోసం వినతి



మెరకముడిదాం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మెరకముడిదాం: తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది తహసీల్దార్ అజూరఫీజాన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన డీఈఓలకు, జీఓ నంబరు 7 ద్వారా వేతనాలను విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎం.సత్యనారాయణ, అప్పలనాయుడు, గౌరినాయుడు, గంగునాయుడు ఉన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: తమకు కొంత కాలంగా చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని 104 సిబ్బంది ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, రెవెన్యూ కార్యాలయ డీటీ వరప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తమకు జీతాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని సిబ్బంది శంకరరావు, సంతోష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి రూరల్(గరివిడి): తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని, తమ డిమాండ్లను పరిష్కరించి, జీతాలు చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ గరివిడి 104 సిబ్బంది శుక్రవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ అధికారుల రూట్ సర్వే



ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న ఆర్టీసీ అధికారులు

వేపాడ: మండల కేంద్రం మీదుగా ఆర్టీసీ సర్వీసులు నడపాలని మండల ప్రజల వినతి మేరకు ఆర్టీసీ ఎస్.కోట డిపోకు చెందిన సూపరింటెండెంట్ వెంకటరావు, ఆర్‌హెచ్‌సీ సత్యారావు, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, రాములు శుక్రవారం రూట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వేపాడలో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్.కోట నుంచి వేపాడ మీదుగా చోడవరం, అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నంకు బస్సులు వేయాలని కోరారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. వేపాడ, బల్లంకి, బానాది రూట్ సర్వే నిర్వహించామని అధికారులు తెలిపారు.

విశేష స్పందన



మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో భైరిపురం, పెదమంత్రిపేట, గర్భాం కొత్తవీధి తదితర గ్రామాలకు చెందిన 212 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. విజయనగరానికి చెందిన శ్రీసాయి సూపర్ స్పెషాల్టీ వైద్యాధికారులు బి.దీపిక, ఒ.రాజేశ్వరి, ఎస్.అఖిల్ తమ సేవలు అందించారు. ఉప సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, కందుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. – మెరకముడిదాం

న్యాయ సేవలపై అవగాహన



న్యాయసేవా దినోత్సవం సందర్భంగా ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయసేవా కమిటీ చైర్మన్ ఎస్.వాణి అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి, ఇతరత్ర పరిస్థితుల వల్ల న్యాయం అందకుండా అవస్థలు పడే వారికి న్యాయం అందించడమే లక్ష్యంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాలూకా నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతి న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయసేవా సాధికార సంస్థలు ఏర్పాటు చేసి, ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నామని తెలిపారు. స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

రాష్ట్ర స్థాయి పోటీలకు పెదనడిపల్లి విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం, పీఈటీ తదితరులు

చీపురుపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న టెన్నీకాయిట్ పోటీలకు మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి టెన్నీకాయిట్ పోటీలు జరిగాయి. జిల్లా స్థాయిలో అండర్ – 14 విభాగంలో కె.ఇందు, కె.హరికృష్ణ, జి.కార్తీక్, అండర్ – 17 విభాగంలో జి.హైమ, ఐ.దీపిక, వి.వినయ్‌కుమార్, కె.జశ్వంత్‌లతో పాటు అండర్ – 19 విభాగంలో బి.గీత ఉత్తమ ప్రతిభ కనపరిచారు. దీంతో వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 9, 10 తేదీల్లో ఏలూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో వీరు పాల్గొంటారు.

సంతాపం



కొత్తల తాడు(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని పి.లింగాలవలస సర్పంచ్ కొత్తల మంగమ్మ భర్త, మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొత్తల తాడు(45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తాడు నీరసంగా ఉండడంతో గురువారం రాత్రి దగ్గరలో ఉన్నరామభద్రపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం విజయనగరం శుక్రవారం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈయన మృతికి పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

గ్రామ సేవకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న



ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకన్న

వేపాడ: మండలంలోని రామస్వామిపేట వీఆర్ఏ గట్టు వెంకన్న ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళగిరిలో శుక్రవారం జరిగిన ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వెంకన్న తెలిపారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులతో కలిసి పని చేస్తానన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



అవంతి క్రోనికల్ న్యూస్ లెటర్‌ను విడుదల చేస్తున్న అవంతి సంస్థల చైర్మన్, జేఎన్‌టీయూ వీసీ తదితరులు

- జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి
- హాజరైన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్

చీపురుపల్లి రూరల్(గరివిడి): జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని విజయనగరం గురజాడ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో మంచి నడవడిక నేర్చుకోవాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలని సూచించారు. చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి ఉన్నతికి సాంకేతిక విద్య పునాది వంటిందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉండే గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కళాశాలలోనే మంచి ఉద్యోగ అవకాశాలు పొందేలా ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాంగణ ఎంపికలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అవంతి క్రోనికల్ న్యూస్ లెటర్‌ను విడుదల చేశారు. క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం విప్రో లీడ్ కన్సల్టెంట్ టి.సురేష్, బ్రహ్మకుమారీ హేమలత, అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ఎం.మహేష్, విద్యా సంస్థల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.